క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ముత్యాలమ్మపాలెంలో వైద్య శిబిరం నిర్వహించాలి

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో విష జ్వరాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి విష జ్వరాలతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ కొన్నాళ్ల నుంచి గ్రామంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారని చెప్పారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యంతో పాటు మందులు ఉచితంగా అందజేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను అనకాపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు మాణిక్యం చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మి, సీహెచ్.దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతి



కేంద్ర మంత్రి నారాయణస్వామిని కలిసిన సామ్రాట్ కుమార్ తదితరులు

సబ్బవరం: ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గౌటివాడ సామ్రాట్ కుమార్ విశాఖ వచ్చిన కేంద్ర మంత్రి నారాయణస్వామిని మంగళవారం కలిశారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పు వర్గీకరణకు అనుకూలంగా వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో తోతరమూడి శ్రీను, ఎం. సత్యనారాయణ, సాధూరావు,రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలకు స్పందన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భగవాన్ శ్రీసత్య సాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవత్వం పెంపొందించడం – విద్య ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంస్థ కన్వీనర్ కర్రి బంగారునాయుడు,వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ ఎస్. సత్యనారాయణ పోటీలను పర్యవేక్షించారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



బీచ్ రోడ్డు: తీరానికి గుర్తు తెలియని 25 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం కొట్టుకు వచ్చింది. ఆర్కే బీచ్ ప్రాంతంలో రాళ్ల వద్ద మృతదేహం కనిపించడంతో సందర్శకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామారావు తెలిపారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఊతం

ఎన్టీపీసీ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



విద్యార్థులతో ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, అధికారులు

పరవాడ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు సహకారం అందించడమే లక్ష్యంగా ఎన్టీపీసీ సింహాద్రి కృషి చేస్తుందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఎన్టీపీసీ పరిపాలన భవనంలో మంగళవారం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా జీజీఎం సిన్హా మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి వారి విద్యకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామన్నారు. సీఎస్సార్ విభాగం కార్యక్రమాల్లో భాగంగా సంస్థ పరిసర ప్రాంతాల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఏటా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మెరిట్ ప్రాతిపదికన ప్రభుత్వ ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు కూడా ఉపకార వేతనాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్‌లు దృష్టి సారించాలని ప్రాజెక్టు హెడ్ సిన్హా అన్నారు. సీఎస్సార్ విభాగం ద్వారా జీవీఎంసీ 77 వార్డు పరిధిలో ఇస్లాంపేట, పరవాడ మండలంలో పరవాడ, తానాం గ్రామాల్లోని 3 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, రావాడ, పరవాడ, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సర్పంచ్‌లు, చీఫ్ జనరల్ మేనేజర్ వి.గోవిందరాజన్, ప్రాజెక్టు జీఎం .ఎస్.కె.ఝూ, జీఎం కె.జగన్‌మోహన్‌రావు, జీఎం పద్మప్రియ, హెచ్‌ఆర్ హెడ్ రుమాడిశర్మ, సీఎస్సార్ హెచ్‌ఆర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ మేనేజర్ ఎస్ ఆర్ శివం ప్రతాప్‌సింగ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల సేవలను గుర్తించాలి

డీపీవో శిరీషారాణి



మహాత్మా గాంధీ చిత్రపటానికి క్లాప్ మిత్రలతో కలిసి నివాళులర్పిస్తున్న డీపీవో శిరీషారాణి

సబ్బవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి పిలుపునిచ్చారు.మండలంలోని మొగలిపురం, మల్లునాయుడుపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో క్లాప్ మిత్రలు(పారిశుధ్య కార్మికులు) కీలక భూమిక పోషిస్తున్నారన్నారు.అటువంటి వారి సేవలను గుర్తించి ప్రజలు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించి పారిశుధ్య కార్మికులకు స్వయంగా కాఫీ ఇచ్చి వారితో కలిసి కాఫీ తాగారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ నెల 30 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల గురించి అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అన్ని గ్రామాల క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సంపద కేంద్రాల జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి,సర్పంచ్ బోను దేవుడమ్మ, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, ఈవోఆర్డీ మహేష్, నాయకులు బోను గంగునాయుడు,గండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలను తీసుకువస్తున్న అర్చకులు



స్వామి ఉత్సవమూర్తుల చెంత పవిత్రాలు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం పవిత్రాల సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వైదికులు రాత్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తులు, ఇతర దేవతామూర్తులు, ఆలయ శిఖరం, ఆలయ ప్రాంగణాలకు పవిత్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంతన విశేష హోమాలు, పారాయణాలను వైదికులు నిర్వహించారు. బుధవారం పవిత్ర విసర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కార గ్రహీతకు సత్కారం

ఏయూ క్యాంపస్: డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచార్య పురస్కారం అందుకున్న ఏయూ సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి విద్యార్థిని మంగళవారం ఉదయం విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీ షణ్ముఖానంద సభ నుంచి ఆమె ఈ పురస్కారం స్వీకరించిన సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆచార్య సరస్వతి విద్యార్థి కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ భారతీయ సంగీతం, సాహిత్యం ఎంతో విశిష్టమైనవన్నారు. విభాగాధిపతి ఆచార్య అనురాధ, విభాగ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు పెద్దపీట

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సింహాచలం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సకాలంలో పరిష్కారం కాకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని విశ్రాంత న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. పెందుర్తి ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల హక్కు చట్టం చాలా పవర్‌ఫుల్ అని గుర్తు చేశారు. వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థ అందించాల్సిన సేవలకు నిర్ణీత కాల పరిమితిని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించిందని చెప్పారు. ఆ నియమావళి ప్రకారం సేవలు అందించకుండా సంస్థ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అయితే వినియోగదారులు ముందుగా తమ ప్రాంత ఏఈఈకి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే 1912 టోల్‌ఫ్రీకి కూడా ఫిర్యాదు చేయాలన్నారు. అలా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోతే న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం పథకంతో బహుళ ప్రయోజనాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్టైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం



సదస్సులో పాల్గొన్న రైతులు

- రైతులకు సబ్సిడీపై రుణాల మంజూరు
- స్టైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం

ఆరిలోవ: ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్టైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 368 మంది రైతులు పాల్గొన్న ఈ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌ఎల్‌ఎం కింద గొర్రెలు–మేకలు, నాటు కోళ్లు, పందుల పెంపకందార్లతో పాటు పాడి రైతులు పశుదాణా ఉత్పత్తి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు వ్యాపార సరళిలో ఎన్‌ఎల్‌ఎం పథకం ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు ఏర్పాటు కోసం ముందుకొచ్చిన రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కూడా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్‌ఎల్‌ఎం పథకం లక్ష్యాల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పలువురు అధికారులు బ్యాచ్‌ల వారీగా అవగాహన కల్పించారు. ఎన్‌ఎల్‌ఎం పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ఎంత సబ్సిడీ లభిస్తుంది తదితర వాటి గురించి వివరించారు. ఉప సంచాలకుడు డాక్టర్ కె.కరుణాకరరావు, డీసీబీసీయూ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డాక్టర్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.శ్రీనుబాబు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

త్వరలో ట్రస్ట్ బోర్డు సమావేశం

- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి
- ఈవోను మర్యాద పూర్వకంగా కలిసిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు



ఈవో శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: త్వరలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహిస్తామని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. దేవస్థానం ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని మంగళవారం ట్రస్ట్‌బోర్డు సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పాలకమండలి సమావేశం నిర్వహించాలని కోరారు. స్పందించిన ఈవో అజెండా సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మరో సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన ప్రహ్లాద మండపాన్ని తిరిగి దేవస్థానం స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. అలాగే అప్పన్న సోదరిగా వెలుగొందుతున్న సత్తెమ్మతల్లి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఈవోను కోరారు.

సింహగిరికి వచ్చే భక్తులకు సింహాచలం కొండ ఎటువైపు ఉందో తెలిసేలా ఆయా మార్గాల్లో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం ఏయే అభివృద్ధి పనులు చేయాలో సమగ్ర వివరాలతో కూడిన వినతి పత్రం ఈవోకు అందజేశారు. సమావేశంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, వంకాయల సాయి నిర్మల, ముదుండి రాజేశ్వరి, బయ్యవరపు రాధ, దశమంతుల రామలక్ష్మి, కృష్ణమూర్తి పాత్రుడు, ప్రత్యేక ఆహ్వానితులు చందుయాదవ్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

పాడిరైతులకు రాయితీపై వీర్య నాళికలు

ఏడీ రామకృష్ణకీర్తి

పరవాడ: కృత్రిమ గర్భధారణ, లింగ నిర్ధారణ వీర్య నాళికలను రాయితీపై అందజేస్తున్నామని పరవాడ పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి అన్నారు. మండలంలో పి.బోనంగి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో మంగళవారం ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్‌తో ప్రారంభించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ నేటి లేగదూడలే రేపటి పాడి పశువులని చెప్పారు. లేగ దూడల పోషణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రదర్శనలో పాల్గొన్న 54 లేగదూడల్లో మేలు జాతి, ఆరోగ్యకరమైన లేగదూడలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మిశ్రమ దాణా, టానిక్, మందులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ అశ్విని ప్రపుల్లా, డాక్టర్ పి.సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలు అవసరం



రవీంద్ర శుక్లాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మానవతా విలువలు యువత కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర పూర్వ విద్యాశాఖ మంత్రి డాక్టర రవీంద్ర శుక్లా అన్నారు. మంగళవారం ఆయన ఏయూ హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలను విద్యా వ్యవస్థలో అంతర్భాగం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా తాను పనిచేసిన సమయంలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని నిలుపుతూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర శుక్లాను హిందీ విభాగ ఆచార్యులు నల్ల సత్యనారాయణ, ఆచార్యులు, పరిశోధకులు, తదితరులు ఘనంగా సత్కరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు శిక్ష

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యూపోర్టు, హార్బర్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందిని ఒకటో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్‌కు 10 రోజులు జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి మొత్తంగా రూ.1.78 లక్షలు జరిమానా వేశారు. ఆరిలోవ పరిధిలో 16 మందికి రూ.30,500, పీఎం పాలెం పరిధిలో 14 మందికి రూ.49 వేలు, గోపాలపట్నం స్టేషన్ పరిదిలో 10 మందికి రూ.26 వేలు, పెందుర్తిలో 20 మందికి రూ.47,500 జరిమానా విధించారు. అలాగే కంచరపాలెం స్టేషన్ పరిధిలో 20 మందికి రూ.1.04 లక్షల జరిమానా విధించడంతో పాటు వారిలో ఏడుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. గాజువాక పరిధిలో 15 మందికి రూ.38 వేలు, టూ టౌన్ స్టేషన్ పరిధిలో 15 మందికి రూ.1.19 లక్షలు జరిమానా వేశారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం



సమావేశాలకు హాజరైన యూనియన్ ప్రతినిధులు, నాయకులు



సమావేశాలు ప్రారంభిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 10వ ద్వి–వార్షిక సర్వసభ్య సమావేశాలు మంగళవారం తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌ఐఆర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెయింటెనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వీరిని సూపర్‌వైజర్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఐఆర్ గుర్తింపు పొందిన యూనియన్ల పోరాటంతో త్వరలోనే ఎన్‌పీఎస్ రద్దవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కే కే, కే–ఆర్ లైన్‌లో ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు వర్క్ టు రూల్ అమలు చేయాలని, సిబ్బందికి పనిభారం తగ్గేలా చూడాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వాల్తేర్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్, డివిజనల్ కో–ఆర్డినేటర్ టి.వి.మాళేశ్వరరావు పాల్గొన్నారు.

నాయకత్వం, నైపుణ్యాలపై అవగాహన



అజిత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి, తదితరులు

ఏయూ క్యాంపస్: నాయకత్వ లక్షణాలు వ్యక్తి ప్రగతిని, వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వీడీఎం ఇండియా ఆన్ దమూవ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నాయకత్వ నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. సమూహంగా పని చేయడం, సమష్టిగా విజయం సాధించడం, నాయకత్వం వహించడం వంటి విభిన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, వ్యవస్థను ప్రభావితం చేసే వ్యక్తులుగా ఎదగాలన్నారు.

వివాహిత అదృశ్యం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు భోగాపురపు వారి వీధికి చెందిన లింగాల ధనలక్ష్మి (23) అనే వివాహిత సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయింది. విజయనగరం జిల్లా బలిజిపేట మండలం పలగర గ్రామానికి చెందిన గుడివాడ బాబూరావుకు ధనలక్ష్మితో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తున్న బాబూరావు, ధనలక్ష్మితో తగరపువలసలో కాపురం పెట్టారు. సోమవారం ఉదయం బాబూరావు ఉద్యోగానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా ఇంటి వద్ద భార్య కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన బహుభాషా అంతర్జాతీయ సదస్సు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతి సౌజన్యంతో కన్వీనర్, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పీకే జయలక్ష్మి నేతృత్వంలో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక తత్వాన్ని నేటి యువతకు అందించాల్సి బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇలాంటి బహుభాషా సదస్సులు అధ్యాపకులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు, ఆధ్యాత్మిక వేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలుగు, హిందీ, సంస్కృత సాహిత్యాలు, ఇతిహాసాలు, పురాణాల్లో ప్రవచించిన ఆధ్యాత్మిక తత్వాన్ని వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు.